బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

పాలేపల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

దోమ, నవంబర్ 3: దోమ మండల పరిధిలోని పాలేపల్లి గ్రామంలో ఆర్టీసీ డ్రైవర్ దస్తయ్య, టీచర్ శ్రీనివాస్‌ల మాతృమూర్తి ఈడిగి నర్సమ్మ ఇటీవల మరణించింది. విషయం తెలుసుకున్న పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆదివారం గ్రామంలోని మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, మాజీ ఉప సర్పంచ్ రమేశ్, నాయకులు సంతోశ్, పురుషోత్తం, హన్మంతు, గంగాపురి, వెంకటయ్య, మల్లేశ్, ఖాజామియా తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



పట్లూర్‌లో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మధుకర్

మర్పల్లి, నవంబర్ 3: మండల పరిధిలోని పట్లూర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు మ్యాతరి జైలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ మధుకర్ ఆదివారం గ్రామస్తులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. రూ.5 వేల నగదు అందజేశారు. అలాగే మాజీ సర్పంచ్ ఇందిరాశోక్‌కు రూ.2వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు బాలేశ్, నాయకులు అశోక్, రాజు, వికాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జీవిత విధానంలో మూలాలు గొప్పవి

పరిగి, నవంబర్ 3: భారతీయ జీవిత విధానంలోనే మూలాలు చాలా గొప్పవని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పరిగిలోని శ్రీనివాస్‌కాలనీలో హిందూ ధార్మిక సమితి ఆధ్వర్యంలో జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ భాస్కరయోగి కార్తిక మాస దీపోత్సవ సత్సంగం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయాలు అశాశ్వతమన్నారు. భారత దేశంలో కుటుంబ ఆధారంగా జీవితాన్ని గడపాలని, మూలాలను ఆచరించే విధానం సత్సంగం ద్వారా అందరూ ఆచరించాలని సూచించారు. కుటుంబ జీవనాన్ని అభివృద్ధి చేసుకొని సంతోషంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మాజీ సర్పంచ్ సిద్ధాంతి పార్థసారథి, బీజేపీ నాయకులు కరణం ప్రహ్లాదరావు, మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, శివరాజు, కేపీ రాజు, వెంకటయ్యగౌడ్, పెంటయ్యగుప్తా, వి.రాముయాదవ్, జి.బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

కార్యకర్తల ద్వారా ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- వరి కొనుగోలు కేంద్రాల ప్రారంభం



పరిగి: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, నవంబర్ 3: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ద్వారానే చేపడుతున్నామని, గ్రామాల్లో హైమాస్ట్ లైట్లు కార్యకర్తల ద్వారానే ఆన్ చేయిస్తున్నామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఆదివారం పరిగిలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు ఉచిత వంట గ్యాస్ పంపిణీకి సంబంధించి సీఎం బొమ్మతో గ్యాస్ పత్రాల పంపిణీని కార్యకర్తల ద్వారా చేపట్టామని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇండ్లు సైతం కార్యకర్తల ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేయడంతో పాటు వారు కోరిన మేరకు ఇండ్లు మంజూరు చేయిస్తానన్నారు. ఈసారి నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరయ్యాయని, కొద్ది నెలల్లోనే రెండో ఏడాదికి సంబంధించి మరో 3.500 ఇండ్లు మంజూరవుతాయని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించిందని, ఏ గ్రేడ్ వడ్లకు క్వింటాలుకు రూ.2,320తోపాటు బోనస్ అదనం అన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా బిజినెస్ మేనేజర్ వెంకట్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు పరశురాంరెడ్డి, అశోక్, డీసీఎంఎస్ పరిగి ఇన్‌చార్జి వెంకటయ్య, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

దోమ: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, రాములు నాయక్, యువ నాయకులు శివకుమార్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, లింగన్‌పల్లి నర్సింహులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించడానికే..

కులకచర్ల: రైతులకు గిట్టుబాటు ధరను కల్పించేందుకు ప్రభుతం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని డీసీఎంఎస్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోటు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కులకచర్ల పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బ్లాక్ బీ అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, నాయకులు కృష్ణారెడ్డి, కుమ్మరి స్వామి, రవినాయక్, పీరంపల్లి జంగయ్య, బచ్చిరెడ్డి, వెంకటయ్యగౌడ్, కృష్ణయ్య, అంజిలయ్యగౌడ్, నర్సింహులుయాదవ్, ఆనందం, వెంకటయ్యగౌడ్, బాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, కొండయ్య, నాయకులు, కార్యకర్తలు, డీసీసీబీ, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

చౌడాపూర్‌లో..

చౌడాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో పీఏసీఎస్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్‌కుమార్, పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

కులకచర్ల మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన మాజీ సొసైటీ డైరెక్టర్ తెలుగు పెద్ద నర్సింహులు అనారోగ్యంతో మృతి చెందారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో రూ.9వేలు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్యతో కలిసి మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కులకచర్ల మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, పీఏసీఎస్ సీఈవో బక్కారెడ్డి, మృతుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పరిగి సీఐకి డీఎస్పీగా పదోన్నతి

శ్రీనివాస్, పరిగి సీఐ

పరిగి, నవంబర్ 3: పరిగి పోలీసు సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా పని చేస్తున్న శ్రీనివాస్ డీఎస్పీగా పదోన్నతి పొందారు. ఫిబ్రవరి 11 నుంచి ఆయన పరిగి సీఐగా పని చేస్తున్నారు. సీఐ శ్రీనివాస్‌కు డీఎస్పీగా పదోన్నతి కల్పిస్తూ ఉన్న తాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పదోన్నతి పొందిన శ్రీనివాస్ డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయనున్నారు.

సమస్యలను తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తాం

దరఖాస్తులు స్వీకరిస్తున్న ట్రాన్స్‌కో ఏడీ వెంకట్‌నాయుడు

పరిగి, నవంబర్ 3: విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తామని ట్రాన్స్‌కో పరిగి ఏడీ వెంకట్‌నాయుడు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఆదివారం పరిగిలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులు విద్యుత్‌కు సంబంధించి ఏ సమస్య ఉన్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకు రావాలని చెప్పారు. సకాలంలో వాటిని పరిష్కరిస్తామన్నారు. ప్రతి సమస్యను రాతపూర్వకంగా తెలియజేయాలని ఆయన సూచించారు. ఈ మేరకు వినియోగదారుల నుంచి సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో దోమ ఇన్‌చార్జి ఏఈ కిశోర్, లైన్ ఇన్‌స్పెక్టర్లు అబ్దుల్ సమద్, గోపాల్, లైన్‌మన్ కేశవులు, వినియోగదారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పరిగి, నవంబర్ 3: వారంతా పూర్వ విద్యార్థులు. 21 ఏండ్ల క్రితం పదో తరగతి పూర్తి కాగానే ఉన్నత చదువుల కోసం వేర్వేరు ప్రాంతాలకు వెళ్లారు. ఆ తర్వాత ఉద్యోగాలు, ఉపాధి చేసుకుంటూ జీవిస్తున్నారు. మరోసారి కలువాలనే తపనతో వారంతా ఒక చోటకు చేరారు. పరిగిపట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల (నంబర్ 2) 2002–03 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని వివిధ రంగాలలో స్థిరపడిన వారందరూ కలిసి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. బాల్యం, యవ్వనంలో తాము ఆడుకున్న ఆటపాటలతో సందడి చేశారు. ప్రతి ఏడాది ఇలాంటి సమ్మేళనాలు నిర్వహించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.

కులగణన విధులు అశాస్త్రీయం

పరిగి, నవంబర్ 3: రాష్ట్రంలో చేపడుతున్న కుల గణన నిర్వహణలో ప్రభుత్వం ఉపాధ్యాయులకు విధుల కేటాయింపు విషయంలో అసంబద్ధంగా వ్యవహరించిందని, ఇది అశాస్త్రీయంగా ఉన్నదని టీయూటీఎఫ్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుదర్శన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే సరిచేయాలని డిమాండ్ చేశారు. విధుల కేటాయింపులో ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలను విస్మరించడం సరికాదన్నారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకే విధులు కేటాయించడంతో తీవ్ర ఒత్తిడి, ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే ప్రమాదంతో పాటు ప్రాథమిక పాఠశాలలపై ప్రభావం చూపుతుందన్నారు. అంగవైకల్యం, గర్భిణి ఉపాధ్యాయులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని విధుల నుంచి తప్పించాలన్నారు. ఒకపూట పాఠశాల విధులు, మధ్యాహ్నం నుంచి సర్వేకు వెళ్తే గ్రామాల్లో ప్రజలు ఎవరూ అందుబాటులో ఉండరని తెలిపారు. సర్వే సమయం మార్చాలన్నారు. ప్రభుత్వం అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని ఏస్థాయి పాఠశాలలకు ఇబ్బంది కలగకుండా ఉపాధ్యాయులందరికీ కులగణన విధులు కేటాయించాలని వారు కోరారు.

కోతి దాడిలో వ్యక్తికి గాయాలు

దోమ, నవంబర్ 3: కోతి దాడి చేసి వ్యక్తిని గాయపరిచిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. దోమ గ్రామానికి చెందిన నీలి శ్రీశైలం ఇల్లు తెరిచి ఉంచడంతో ఇంట్లోకి దూరిన కోతిని బయటకు వెళ్లగొట్టేందుకు యత్నించారు. రెచ్చిపోయిన కోతి శ్రీశైలంపై దాడిచేసి నడుం భాగంలో గోర్లతో గాయపరిచి వెళ్లిపోయింది. కోతుల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడంతో ఆహారం కోసం ఇండ్లలో చొరబడి మహిళలను నానా ఇబ్బందులకు గురి చేయడంతో పాటు పంట పొలాలాల దగ్గర సైతం పంటలను నాశనం చేస్తున్నాయి. ఇలాంటి ఘటనలు ఎన్నో జరిగాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు జరగకుండా కోతులను ఇక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేయాలని కోరుతున్నారు.

పోలీసులమంటూ వృద్ధురాలికి బెదిరింపు

- రూ.38 లక్షలు కొట్టేసిన సైబర్ చీటర్స్
- కొనసాగుతున్న డిజిటల్ అరెస్ట్‌లు
- ఇటీవలే రూ.3 కోట్లు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

సిటీబ్యూరో, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): వృద్ధురాలిని లక్ష్యంగా చేసుకొని.. తాము పోలీసులంటూ బెదిరించిన సైబర్‌నేరగాళ్లు రూ. 38 లక్షలు కాజేశారు. వివరాలిలా ఉన్నాయి.. 74 ఏండ్ల బాధితురాలికి ఫోన్ చేసిన సైబర్‌నేరగాళ్లు.. ముంబైలోని అంధేరీ పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్నామని చెప్పారు. మీపై ఎఫ్ఐఆర్ నమోదయ్యింది.. మీ ఫోన్ నంబర్‌ను ట్రాయ్ 24 గంటల్లో డిస్‌కనెక్ట్ చేస్తుంది.. అని బెదిరించారు. జెట్ ఎయిర్‌వేస్ ఫౌండర్ నరేశ్ గోయెల్‌కు సంబంధించిన మనీలాండరింగ్‌తో మీకు సంబంధం ఉన్నట్లు తేలింది.. అందులో భాగంగానే సీబీఐ, ఈడీ దర్యాప్తు చేస్తున్నాయి.. అంటూ భయపెట్టారు. మీ బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ చేయాలి.. మీ బ్యాంకు ఖాతాల్లో డబ్బు ఉంటే ఆర్‌బీఐ ఖాతాలో జమ చేయాలి.. అంటూ ఆమెను ఆందోళనకు గురిచేశారు. మీకు ఈ కేసుతో సంబంధం లేదని తేలితే.. మీరు ఆర్‌బీఐలో జమచేసిన డబ్బు తిరిగి వస్తాయంటూ నమ్మించారు. ఎవరికైనా ఈ విషయం చెబితే మీరు అరెస్ట్ అవుతారని, ఈ కేసులో మీ కుటుంబం మొత్తం ఇరుక్కుంటుందంటూ హెచ్చరించారు. దీంతో బాధితురాలు భయపడిపోయింది. ఆమె ఫిక్స్‌డ్ డిపాజిట్లను విత్‌డ్రా చేసి రూ. 37.90 లక్షలు ఆర్టీజీఎస్ ద్వారా సైబర్ నేరగాళ్లు సూచించిన బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేసింది. ఆ తర్వాత ఆమెకు అనుమానం రావడంతో కుటుంబసభ్యులతో చర్చించి ఇదంతా మోసమని చెప్పారు. దీంతో సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ప్రతి రోజూ మోసాలు..

ఇలాంటి ఘటనలు ప్రతి రోజూ ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో జరుగుతూనే ఉన్నాయి. ఇంగ్లిష్, హిందీ మాట్లాడే సీనియర్ సిటిజన్లు, నడి వయస్సు వాళ్లు ఇందులో ఎక్కువగా మోసపోతున్నారు. రెండు రోజుల కిందట ఓ వైద్యురాలిని కూడా ఇదే విధంగా బెదిరించిన సైబర్ నేరగాళ్లు.. దాదాపు 10 రోజుల పాటు ఆమెను డిజిటల్ అరెస్ట్‌లోనే ఉంచి రూ.3 కోట్లు కొట్టేశారు.

ఈ తరహా నేరాలను అరికట్టేందుకు పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు, అలాగే, ఇటీవల మన్‌కీ బాత్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సైతం డిజిటల్ అరెస్టులంటూ ఏమీ ఉండవని, అలాంటి వాటికి భయపడొద్దని ప్రజలకు సూచించారు. ఇలాంటి మోసాలపై మరింత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పోలీసు సీనియర్ అధికారులు తెలిపారు.

డ్రంక్‌అండ్‌డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్

సైబరాబాద్‌లో 3 రోజుల్లో 513 మంది పట్టివేత

వీరిలో 425 మంది ద్విచక్ర వాహనదారులే

సిటీబ్యూరో, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): రోడ్డు ప్రమాదాలను నివారించడంలో భాగంగా సైబరాబాద్ పోలీసులు మద్యం మత్తులో వాహనాలు నడిపే మందుబాబులపై కొరడా ఝుళిపిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 1వ తేదీ నుంచి 3 వరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 513 మంది మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. పట్టుబడిన 513 మందిలో 425 మంది ద్విచక్ర వాహనదారులే ఉండటం గమనార్హం. 24 మంది త్రీ వీలర్ డ్రైవర్స్, 60 మంది ఫోర్ వీలర్ డ్రైవర్స్, నలుగురు భారీ వాహన డ్రైవర్లు పట్టుపడ్డారు. మొత్తం పట్టుబడిన వారిలో 64 మందికి బీఏసీ 200ఎంజీ/100ఎంఎల్, 550ఎంజీ/100ఎంఎల్‌గా నిర్ధారణ జరిగింది. దీంతో పట్టుబడిన వారందరినీ న్యాయస్థానంలో హాజరుపరిచారు.

మూలన పడ్డ బాడీ వార్న్ కెమెరాలు.!

- పనిచేస్తున్నట్టా.? లేదా.?
- హోంగార్డుల చేతికి ట్యాబ్‌లు
- కారులో నుంచి సీట్ కదపని కొందరు అధికారులు
- గాలికొదిలిన ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

సిటీబ్యూరో, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): ట్రాఫిక్ విభాగంలో పారదర్శకమైన సేవలందించడంలో భాగంగా అందుబాటులోకి తెచ్చిన బాడీ వార్న్ కెమెరాలు మూలన పడ్డాయి. నేడు ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో వీటి వినియోగాన్ని పూర్తిగా పక్కకు పెట్టారు. మరోపక్క ట్రాఫిక్‌లో పనిచేస్తున్న ఠాణాల స్థాయిలోని అధికారులు ఫీల్డ్ వర్క్‌లోకి వెళ్లడం లేదనే విమర్శలు వస్తున్నాయి. హోంగార్డుల చేతికి ట్యాబ్‌లు ఇచ్చి చలాన్లు కొట్టండంటూ ఆదేశిస్తూ.. హాయిగా కొందరు కారు ఏసీ లోనుంచి కాలు కింద పెట్టకుండా ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఏర్పడితే స్థానికంగా ఉండే ఏఎస్సై, కానిస్టేబుల్, హోంగార్డులు చూసుకుంటారు. కొందరు సీనియర్ అధికారులు మాత్రం మనమెందుకు పోవాలే.. అన్నట్టు కారు సీట్‌పైనుంచి దిగడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. వీఐపీ మూమెంట్స్ ఉన్న ప్రాంతాల్లో మాత్రమే రోడ్లపై ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు కనిపిస్తున్నారు.

బాడీ వార్న్ కెమెరాల మాటే లేదు.!

ఇటీవల జూబ్లీహిల్స్‌లో ట్రాఫిక్ పోలీసులకు, ఒక వాహనదారుకు మధ్య గొడవ జరిగింది. వాహనదారుడు పోలీసులతో వాగ్వాదానికి దిగి, తన వాహనాన్ని కిందపడేయడం వంటి ఘటనలు జరిగాయి. అయితే, ఇలాంటి ఘటనలో పోలీసులు సంయమనం పాటిస్తూ.. ఆవేదనతో ఉండే వాహనదారుడి సమస్యను వినేవాళ్లు కొందరు ఉంటారు. మరికొందరు అవతలి వారికంటే ఎక్కువగా రెచ్చిపోతుంటారు. ఈ సందర్భంలోనే పోలీసులు చేయి చేసుకోవడం వంటి ఘటనలు కూడా జరుగుతుంటాయి. ఇలాంటి సమస్యలు రాకుండా ఉండేలా బాడీ వార్న్ కెమెరాలను క్షేత్ర స్థాయిలో ఉండే ట్రాఫిక్ పోలీసులు ధరించాలని కొనుగోలు చేశారు. ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో 200పైగానే కెమెరాలు ఉన్నాయి. ఈ కెమెరాల కొనుగోలు వ్యవహారంలోనూ కొందరు అధికారులు కక్కుర్తిపడ్డట్టు ఆరోపణలు ఉన్నాయి. కోట్ల రూపాయలు వెచ్చించి ఈ కెమెరాలను కొన్న పోలీసులు నేడు వాటిని వాడటం లేదు. అయితే, ఈ కెమెరాలు వాడక పోవడంపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కెమెరాలు పనిచేస్తున్నాయా.? మొత్తానికి పాడయ్యాయా.? పనిచేస్తున్నా.. ఆ కెమెరాలను ఎందుకు వాడాలి అనే భావనతో మూలన పడేశారా.? అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ గాలికి.!

ఎస్సైలు, ఇన్‌స్పెక్టర్లు ట్యాబ్‌లు పట్టే పరిస్థితి లేదు. అలా అని క్షేత్ర స్థాయిలో ఎస్సైలు పని చేసినా, ఇన్‌స్పెక్టర్లు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. వారి చేతిలో ఉండే ట్యాబ్‌లు హోంగార్డులు, కానిస్టేబుళ్ల చేతికి ఇవ్వడంతో.. రోజు వారీగా లక్ష్యంగా పెట్టుకున్న 40 నుంచి 50 చలాన్లు కొట్టడం పనిగా పెట్టుకున్నారు. హోంగార్డులు, కానిస్టేబుళ్లతో చలాన్లు కొట్టిస్తుండటంతో ఆయా కూడళ్లలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించే ట్రాఫిక్ సిబ్బంది తక్కువ ఉండటం, కొన్ని చోట్ల అసలు ఉండటంలేదు. కనీసం ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు ట్రాఫిక్ రద్దీ ఏర్పడే కూడళ్లలో కొద్దిసేపు ఉన్నా.. ట్రాఫిక్ ఇబ్బందులు కొంతైనా తగ్గే అవకాశముంటుంది. అయితే, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు, పోలీస్ ఉన్నతాధికారులు రోజూ రాకపోకలు సాగించే మార్గాల్లో మాత్రం ఇన్‌స్పెక్టర్లు కనిపిస్తున్నారు. మిగతా రూట్లలో చాలా వరకు ఇన్‌స్పెక్టర్లు రోడ్డుపైకి రావడం లేదనే విమర్శలు వస్తున్నాయి. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

మానసిక ఆరోగ్యం కోసం ధ్యానం చేయాలి

బ్రహ్మకుమారీస్ వార్షికోత్సవంలో నృత్యప్రదర్శన చేస్తున్న నిర్వాహకులు, తిలకిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌తదితరులు

శంషాబాద్ రూరల్, నవంబర్ 3 : మానసిక ఆరోగ్యం కోసం ధ్యానం చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ సూచించారు. ఆదివారం హుడా కాలనీలోని బ్రహ్మకుమారీస్ రాజయోగం మెడిటేషన్ సెంటర్ మొదటి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. కార్యక్రమంలో శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మా రెడ్డి, వైస్ చైర్మన్ గోపాల్‌యాదవ్, కౌన్సిలర్లు మేకల వెంకటేశ్, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సహకరించాలి

సైదాబాద్, నబంబర్ 3 : శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు తీసుకునే నిర్ణయాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాశ్ అన్నారు. ఆదివారం సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మైత్రీ సంఘం ప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, మైనార్టీ నాయకులు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకన్న నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను ఆదా చేస్తే కరెంటును ఉత్పత్తి చేసినట్లే

ఆర్కేపురం, నవంబర్ 3 : విద్యుత్‌ను ఆదా చేస్తే విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లే అని సరూర్‌నగర్ సర్కిల్ ఎస్ఈ చంగారి మాధవరెడ్డి అన్నారు. ఆదివారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా సరూర్‌నగర్ సర్కిల్ పరిధి చంపాపేట్, సరూర్‌నగరర్, ఆటోనగర్ విద్యుత్ డివిజన్‌లలో వినియోగదారుల సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకొని వెంటనే పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. శారదానగర్ కాలనీలో అంతర్గత పోల్స్ ఏర్పాటు చేయాలని, పెరిగిన చెట్ల కొమ్మలు కొట్టి వేయాలని ఫిర్యాదు అందడంతో 24 గంటల్లో సమస్య పరిష్కరించాలని ఏఈ నాగరాజును ఆదేశించారు. పలువురు వినియోగదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. టీజీఎస్‌పీడీసీఎల్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకొని నెల బిల్లుల చెల్లింపుతో పాటు ఏవైనా సమస్యలు ఉన్నా యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చని, 24గంటలు తమ సిబ్బంది అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తెగిపడితే దగ్గర్లో ఉన్న విద్యుత్ అధికారులకు తెలియజేయాలని తెలిపారు. నాణ్యత గల పరికరాలను కొని విద్యుత్‌ను ఆదాచేయాలని సూచించారు. 1912 సేవలు కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ రాజారాంరెడ్డి, ఎస్ఏవో రమణారెడ్డి, ఏడీఈ విజయభాస్కర్, ఏఈలు శ్రీనివాసచారి, నాగరాజు, శంకర్, ఎండీ పాషా ఖాద్రీ తదితరులు ఉన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల